సాక్షి
గుంటూరు
శనివారం । 18 । మే । 2024



దివ్య పూజాబలి

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని బాల ఏసు దేవాలయంలో శుక్రవారం దివ్య పూజాబలి నిర్వహించారు. సహాయ విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్ వాక్యోపదేశం చేశారు.



ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని రామచంద్రాపురంలో ఉన్న శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.

24 నుంచి ఆలయ వార్షికోత్సవాలు



అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మ ఆలయ ప్రతిష్టా వార్షికోత్సవాలు ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్లు భద్రం



గుంటూరు వెస్ట్: గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి సర్వీసు ఓటర్ల ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) కవర్లను శుక్రవారం పోస్టల్ సిబ్బంది నుంచి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అభ్యర్థుల సమక్షంలో స్వీకరించారు. అనంతరం వాటిని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని ట్రెజరీ కార్యాలయంలో భద్రపరిచారు. డీఆర్వో పెద్ది రోజా, పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం మార్పు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో తాత్కాలికంగా ఆస్పత్రి 105 నంబరు గది వద్ద ఉన్న శుశృత హాలులోకి మార్చారు. గుంటూరు రైల్వే స్టేషన్ ఎదురుగా సూపరింటెండెంట్ కార్యాలయానికి సంతకాలు, ఇతర పనుల నిమిత్తం వచ్చేవారు శుశృతహాలులో సంప్రదించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. దాదాపు నెలరోజుల పాటు ఆధునికీకరణ పనులు జరగనున్న నేపథ్యంలో శుశృహాలులోనే సూపరింటెండెంట్ కార్యాలయం కార్యకలాపాలు సాగనున్నట్టు వెల్లడించారు.

చైతన్యకు అప్పిరెడ్డి పరామర్శ



గుంటూరు ఈస్ట్: ఆకుల వారితోటలోని స్టేట్ ఎంప్లాయిస్ ట్రెనింగ్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ డి.చైతన్య ఇంటిపై శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలు బాంబు దాడి జరగడంతో చైతన్యను శాసన మండలి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి పరామర్శించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్వపరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ వివాద రహితుడు, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే నిజాయితీ గల ప్రభుత్వ అధికారి చైతన్య ఇంటిపై దాడి జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అప్పిరెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు ఉన్నారు.

ఖరీఫ్‌కు సిద్ధం కండి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి

కొరిటిపాడు(గుంటూరు): జిల్లా వ్యవసాయ యంత్రాంగం మొత్తం ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. కలెక్టరేట్ ఆవరణలోని వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి ఏడీఏ, సాంకేతిక ఏఓలతో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈసారి పత్తి పాగు పెరిగే అవకాశం ఉన్నందున మండలాల వారీగా బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు ఎన్ని అవసరమో అంచనా వేసి నివేదికలను పంపాలన్నారు. జిల్లాకు ఇప్పటికే సబ్సిడీ విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. కలెక్టర్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాల పొజిషన్ చేయడం, రిజిస్ట్రేషన్‌లు మొదలు పెడతామన్నారు. బీటీ పత్తి విత్తనాల్లో నకిలీలకు తావు లేకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 67 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 2.4 మి.మీ. వర్షం పడింది. సగటున 21.5 మి.మీ వర్షపాతం నమోదైంది. పొన్నూరు మండలంలో 49.8 మి.మీ., తెనాలి 48.8, కొల్లిపర 23.6, దుగ్గిరాల 30.4, పెదనందిపాడు 28.4, తాడేపల్లి 23.8, వట్టిచెరుకూరు 19.4, గుంటూరు తూర్పు 18.2, కాకుమాను 16, గుంటూరు పశ్చిమ 13.4, మంగళగిరి 12, పెదకాకాని 11.8, ప్రత్తిపాడు 10.6, తుళ్ళూరు మండలంలో 3.2 మి.మీ చొప్పున వర్షం పడింది. మే 17 నాటికి సాధారణ వర్షపాతం 34.1 మి.మీ నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 64.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

భద్రత కట్టుదిట్టం

● పల్నాడులో మోహరించిన పోలీస్ బలగాలు ● కొనసాగుతున్న 144 సెక్షన్ ● విస్తృతంగా సోదాలు ● గుంటూరు రేంజ్ ఐజీ పర్యవేక్షణ

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా పల్నాడు జిల్లాలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషన్ సీరియస్ అయిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అదనపు బలగాలను రంగంలోకి దించారు. గ్రామాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. అనుమానం ఉన్న ప్రతి వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ టీడీపీ అరాచకాలు ఆగలేదు. నూజెండ్ల మండలంలో ఎస్సీ కాలనీ వాసులను గ్రామ బహిష్కరణ చేశారు. -సాక్షి, నెట్‌వర్క్



మాచర్లలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని గ్రామ బహిష్కరణ



కాలనీ వాసులతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

● నూజెండ్ల మండలం గురప్పనాయుడిపాలెం గ్రామంలో ఘటన
● గ్రామంలో తాగునీటి ప్లాంట్ వద్దకు రానివ్వని టీడీపీ నాయకులు
● పోలీసులకు, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని ఎస్సీ కాలనీ వాసులను గ్రామ బహిష్కరణ చేశారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం గురప్పనాయుడిపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారని గ్రామంలో తాగునీటి ప్లాంట్ వద్దకు రానివ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని కాలనీ వాసులు వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును గురువారం కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామానికి చెందిన మాశిపోగు వసంతరావు, దూపాటి లింగయ్య, పాలెపోగు యోబు, మాణిక్యరావులతోపాటు పలువురు కాలనీ వాసులు మీడియా ముందు మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా టీడీపీ నాయకులు ఎన్నికలు ముగిసిన వెంటనే గ్రామంలోని వాటర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకోవడానికి వీలులేదని, పొలం పనులకు పిలవబోమని, కౌలుకు భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారని, కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడుతున్నరన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కాలనీలో ఎలా ఉంటారో చూస్తామని బెదిరిస్తున్నారని కాలనీవాసులు వాపోయారు. ఈవిషయమై ఎస్సీ కమిషన్‌తోపాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సామాజిక బహిష్కరణ దారుణం : ఎమ్మెల్యే బొల్లా

గురప్పనాయుడుపాలెం ఎస్సీ కాలనీ వాసులకు తాగునీరు ఇవ్వకుండా పనులకు పిలవకుండా గ్రామ బహిష్కరణ చేయడం దారుణమని ఎమ్మెల్యే బొల్లా అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పరిణామాలు దురదృష్టకరమని అన్నారు. కాలనీ వాసులకు అండగా ఉంటామని తెలిపారు. చట్టపరంగా అధికారులు సమస్యను గుర్తించి గ్రామంలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీకోవాలన్నారు.

ఎస్సీలపై దౌర్జన్యం చేస్తే ఊరుకోం

పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దిటి పౌలేష్

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం గుర్రపునాయుడుపాలెం ఎస్సీ కాలనీ వాసులను గ్రామ బహిష్కరణ ఘటనపై పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దిటి పౌలేష్ స్పందించారు. స్వాతంత్ర్య వచ్చి ఏళ్ల గడుస్తున్నా కొందరి అహంకార ధోరణి మారకపోవడటం దురదృష్టకరమన్నారు. గ్రామంలో ఎస్సీలను తాగునీటికి రానివ్వకుండా అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజకీయాలు సాకుగా చూపి దళితులపై దౌర్జన్యం చేస్తే చూస్తు ఊరుకునేది లేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, రాష్ట మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావుల దృష్టికి తీసుకెళ్లినట్లు సభ్యులు తెలిపారు.

టీడీపీ నేత ఇంట్లో తెలంగాణ మద్యం

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నెల్లూరి రామకోటయ్య ఇంట్లో 104 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎ.సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు రామకోటయ్య ఇంట్లో తనిఖీలు చేపట్టామని, తెలంగాణ నుంచి అక్రమంగా తీసుకువచ్చి నిల్వ చేసిన మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, వీటితోపాటుగా ఇంట్లో నిల్వ చేసిన కర్రలు కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఆయన వెల్లడించారు. రామకోటయ్యని అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు.

మాచర్లలో భారీ బందోస్తు



మాచర్లకు చేరుకున్న పోలీసు వాహనాలు

మాచర్ల: పోలింగ్ రోజు నుంచి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలపై ఈసీ సీరియస్ అయిన నేపథ్యంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి రెండు రోజులుగా పట్టణంలోనే ఉంటూ పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా ఉంచారు. ర్యాపిడ్ ఫోర్స్ బృందాలతోపాటు, పలు శాఖల అధికారులను రంగంలోకి దించారు. నాగార్జునసాగర్, విజయపురిసౌత్ బోర్డర్ నుంచి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రత్యేక బలగాలను నియమించారు. కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అనుమానాస్పద వ్యక్తులను, వాహనాలు తనిఖీలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమానాలు వచ్చినా వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నారు. 144 సెక్షన్ అమలు చేస్తూ ప్రజలు గుంపులుగా సంచరించకుండా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. హింసాత్మక సంఘటనలకు పాల్పడిన వారి గురించి ఆరా తీస్తున్నారు. దాడి జరిగిన ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు పోలీసులు అధికారులు చేపట్టారు. మూడు రోజుల నుంచి నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంది.

కేసానుపల్లిలో కార్డన్ సెర్చ్



కేసానుపల్లిలో తనిఖీలకు హాజరైన పోలీసులు

అనుమానాస్పద నివాస గృహాల్లో తనిఖీలు

దాచేపల్లి: అత్యంత సమస్యాత్మక గ్రామమైన కేసానుపల్లిలో పోలీసులు కార్డన్ సెర్చ్ శుక్రవారం నిర్వహించారు. డీఎస్పీ నాయక్, సీఐ సురేంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామాన్ని జల్లెడ పట్టారు. అనుమానం ఉన్న రాజకీయ నేతల ఇళ్లలో సోదాలు చేపట్టారు. నాయకుల కుటుంబ సమక్షంలో ఇళ్లల్లో తనిఖీలు చేశారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జీ.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అరవిందబాబుపై కేసు నమోదు చేయరా?

లీగల్‌సెల్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి



నరసరావుపేట: టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు చెందిన హాస్పిటల్, ఇంటి ఆవరణలో పెట్రోలు బాంబులు, రాళ్లు, సీసాలు, ఇతర మారణాయులను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎన్నికల చీఫ్ ఏజెంట్ కాకుమాను బాలహనుమంతరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీటిని స్వాధీనం చేసుకొని మూడురోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై ఢిల్లీ ఎన్నికల కమిషన్‌కు, నరసరావుపేటకు రానున్న ఏపీ ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్‌మీనాలకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ నియమించే విచారణ కమిటీ ముందు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి పాల్గొని ఈ విషయం ప్రస్తావిస్తారన్నారు. ఎస్పీ బిందు మాధవ్‌పై ఈసీ తీసుకున్న చర్యలను అభినందించారు. పలు కేసుల్లో సామాన్యమైన వ్యక్తుల కాల్‌డేటాను సేకరించే పోలీసులు ఈ వ్యవహారంలో ఎస్పీ దంపతులతోపాటు, టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు దంపతుల కాల్‌డేటాను కూడా సిట్ సేకరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ శివశంకర్‌పై జరిగే విచారణకు తన వంతుగా ఆధారాలు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి గృహంపై దాడి జరిగితే బందోబస్తుకు సాయుధ పోలీసులను నియమించాల్సి ఉండగా కనీసం లాఠీ కూడా చేతిలో లేని పోలీసులను నియమించటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణంలో 144 సెక్షన్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని, వెంటనే ఆ సెక్షన్ ఎత్తివేసి ప్రజలు, వ్యాపారులకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బడి తెరిచిన రోజే 'కితాబులు'

● జూన్ 12నే విద్యార్థుల చేతుల్లోకి..
● తొలిసారిగా 8,9,10 తరగతుల పుస్తకాలు నేరుగా పాఠశాలలకు..
● ఒకటి నుంచి 7వ తరగతి పుస్తకాలు మండలాలకు..
● ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పాఠ్య పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు
● గత ఐదేళ్లుగా పాఠశాలలు తెరిచే నాటికి నూరుశాతం సరఫరా
● ఇదీ వైఎస్ జగన్ ప్రభుత్వం ఘనత



గుంటూరులోని ప్రభుత్వ గోదాములో పంపిణీకి సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణల పుణ్యమా అని ఐదేళ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు బడి తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు చేరుతున్నాయి. ఏ ఒక్క సంవత్సరమూ పాఠ్యపుస్తకాలు ఆలస్యం కాలేదు. పుస్తకాల కొరత అనే మాటే వినిపించలేదు. వేసవి సెలవుల కంటే ముందే పాఠ్యపుస్తకాల ఇండెంట్ తీసుకుని ప్రభుత్వం సరఫరా చేస్తూ వచ్చింది. ఈసారీ 2024–25 విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్య పుస్తకాలను పాఠశాలలు తెరిచే ముందుగానే పంపిణీకి చర్యలు చేపట్టింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పాఠ్య పుస్తక విభాగ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

3,600 పాఠశాలల్లో 30 లక్షల పాఠ్య పుస్తకాలు

ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రతిఒక్క విద్యార్థికీ పైసా ఖర్చు లేకుండా ఉచితంగా జగనన్న విద్యాకానుక కిట్‌లో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ప్రభుత్వం వాటిని ముందుగానే ముద్రించి పాఠ్య పుస్తక విభాగం ద్వారా జిల్లాలకు పంపుతోంది. 2024–25 విద్యాసంవత్సరానికి ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన 3,600 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా 4.30 లక్షల మంది విద్యార్థులకు అవసరమైన 30 లక్షల పాఠ్య పుస్తకాలకు జిల్లా అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పంపించారు.

8,9,10 తరగతులకు నేరుగా పాఠశాలలకే పుస్తకాలు

పాఠ్య పుస్తక పంపిణీలో మార్పులు తెచ్చిన ప్రభుత్వం 2024–25 విద్యాసంవత్సరం నుంచే కొత్త విధానాన్ని అమల్లోకి తెస్తోంది. ఏటా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను గుంటూరు జిల్లా కేంద్రంలోని గోదాములకు పంపి, అక్కడి నుంచి 57 మండలాల వారీగా ఆర్టీసీ కార్గో బస్సుల ద్వారా పుస్తకాలను పంపేవారు. అయితే ప్రస్తుతం 8,9,10 తరగతుల పాఠ్య పుస్తకాలను ముద్రణా సంస్థల నుంచి నేరుగా ఆయా జిల్లాల్లోని హైస్కూళ్లకు సరఫరా చేయనుంది. దీంతో పాఠశాలలు తెరిచిన రోజున విద్యాకానుక కిట్‌తో కలిపి పుస్తకాలను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఒకటి నుంచి ఏడో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను పాత విధానంలోనే జిల్లా కేంద్రంలోని గోదాములకు పంపుతున్నారు. ఈ విధంగా వచ్చిన పుస్తకాలను ఆర్టీసీ కార్గో బస్సుల ద్వారా మండలాలకు పంపనున్నారు.

4.24 లక్షల పుస్తకాలు రాక

ఒకటి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు ఉమ్మడి జిల్లాలో 14,85,954 పుస్తకాలు అవసరమని అధికారులు ఇండెంట్ పంపారు. ఇందులో ఇప్పటికే 4,24,862 పుస్తకాలు ప్రభుత్వం నుంచి గుంటూరులోని పాఠ్య పుస్తక గోదాముకు వచ్చాయి. మిగిలిన 10.61 లక్షల పుస్తకాలు మరో వారం రోజుల్లో రానున్నాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. గుంటూరు జిల్లా కేంద్రంలోని గోదాముల నుంచి ఉమ్మడి జిల్లాలోని మండల పాయింట్లకు పుస్తకాలను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 8 నుంచి పదో తరగతి వరకు మొత్తం సుమారు 15 లక్షల పాఠ్య పుస్తకాలు నేరుగా బడులకే వెళ్లనున్నాయి.

ప్రభుత్వ వైద్యులపై క్రమశిక్షణ చర్యలు

● ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ
● జూన్ 15లోగా స్పందించకపోతే శాఖాపరమైన చర్యలు
● ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

గుంటూరు మెడికల్: ఇన్ సర్వీస్ కోటా ద్వారా పీజీ కోర్సులు పూర్తి చేసిన వైద్యులు ఐదేళ్లపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించాల్సి ఉండగా కొంతమంది ఈ నిబంధనను ఉల్లంఘించారని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ సర్వీస్ వైద్యులు పీజీ కోర్సుల్లో చేరే సమయంలో ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఐదేళ్లపాటు ప్రభుత్వానికి సేవలందించాల్సి ఉందన్నారు. ఈ షరతును అమలు చేయడంలో విఫలమైతే వారు రూ.20 లక్షలతోపాటు ప్రభుత్వం చెల్లించిన జీత భత్యాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వైద్యులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా వారి నుంచి ఎటువంటి స్పందనా లేదని తెలిపారు. నోటీసులందుకున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్లు జూన్ 15వ తేదీలోగా స్పందించకుంటే నిబంధనల ప్రకారం చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరెవరికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్న వారి వివరాలు డీఎంఈ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్, సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్, హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచామని ఆమె వివరించారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పైకి రాయి విసిరిన వ్యక్తి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై గురువారం గుర్తు తెలియని వ్యక్తి రాయి విసరడంపై గుంటూరు ఆర్‌పీఎఫ్ పోలీసులు ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టారు. సికింద్రాబాద్ నుంచి గుంటూరు మీదుగా తిరుపతి వెళ్తున్న 20701 నంబర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై గుర్తు తెలియని వ్యక్తి రాయి విసిరాడు. ఈ రైలు గుంటూరు రైల్వే స్టేషన్‌కు రాత్రి 9.41 గంటలకు చేరుకుని అక్కడి నుంచి రాత్రి 9.46 గంటలకు బయలుదేరింది. రైలు బయలు దేరిన తర్వాత సుమారు 9.51 గంటలకు అంటే ఐదు నిమిషాలకు ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి ఆర్‌పీఎఫ్ పోలీసులు చేరుకున్నారు. వందేభారత్ రైలుపై రాయి విసిరిన వ్యక్తి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. గుంటూరు రైల్వే స్టేషన్ నుంచి ఘటన చోటు చేసుకున్న ప్రాంతంలో ఉన్న అన్ని సీసీ ఫుటేజ్‌లను రైల్వే పోలీసులు పరిశీలిస్తున్నారు.

యథేచ్ఛగా టీడీపీ దొంగఓట్లు

తక్కెళ్లపాడులో దురాగతం

పెదకాకాని: తక్కెళ్లపాడులో దొంగ ఓట్లు వేసేందుకు పోలింగ్ సిబ్బందితోపాటు కొందరు పోలీసు సిబ్బంది టీడీపీకి సహకారం అందించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో టీడీపీ నాయకులు ముందస్తుగా రచించుకున్న వ్యూహం ప్రకారం పావులు కదిపారు. పోలింగ్‌కు ముందు రోజే పోలింగ్ కేంద్రాల వారీగా స్థానిక నాయకులు గ్రూపులుగా ఏర్పడ్డారు. గ్రామానికి వచ్చి ఓటు వేయలేని వారు, గ్రామంలో లేనివారు, విదేశాల్లో ఉన్న వారి పేర్లతో స్లిప్‌లను 20 నుంచి 50 వరకూ పంచుకున్నారు. ఏ పోలింగ్ బూత్ వద్ద ఎవరు పెత్తనం చెయ్యాలనేది పథకం వేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి దొంగ ఓట్ల పోలింగ్‌కు తెరతీశారు. గ్రామంలో ఉన్న 8 పోలింగ్ బూత్‌లలో ఒక పోలింగ్ బూత్‌కు అదే సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగి ఎన్నికల విధులు నిర్వహించడానికి పీఓగా రావడం కలిసొచ్చింది. మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించడానికి వచ్చిన ఎన్నికల సిబ్బందికి రెవెన్యూ, పంచాయతీ అధికారులు భోజనం ఏర్పాటు చేస్తే తక్కెళ్ళపాడులో మాత్రం అక్కడి నాయకులు తయారు చేసి తెచ్చిన భోజనాన్ని స్థానిక సిబ్బంది ద్వారా అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రతి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకులు స్లిప్‌లు జేబుల్లో పెట్టుకుని దొంగ ఓట్లు వేయించారు. ముందుగా స్లిప్ ఇచ్చిన ఒకరిని లోనికి పంపించడం ఆ తరువాత ఓటు వారిదేనని అబద్ధాన్ని నిజం చేసేందుకు నలుగురు నాయకులు లోనికి వెళ్ళి వాదించడం యథేచ్ఛగా సాగింది. దొంగ ఓట్లు వేసేందుకు కొందరు పోలింగ్ సిబ్బంది సహకరించగా మరికొందరు పోలీసు సిబ్బంది సహకరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసే వారే ఉండాలన్న నిబంధన ఉన్నప్పుడు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రతి బూత్ వద్ద స్థానిక నాయకులు ఎందుకు ఉన్నారో, వారిని ఎందుకు అక్కడి నుంచి బయటకు పంపించలేదో పోలీసు సిబ్బంది జవాబు చెప్పాల్సి ఉంది. గ్రామంలో కొందరు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి తమ ఓటు అప్పటికే వేసి ఉండటంతో తిరిగి ఇంటికి వచ్చిన ఘటనలు కూడా ఉన్నాయి. పుచ్చకాలయపాడు వద్ద ఉంటున్న నిరుపేదలు పోలింగ్ సిబ్బంది నుంచి రెండు స్లిప్‌లు తీసుకుని ఓటు వేస్తుంటే ఆ బూత్ వద్ద ఉన్న నాయకులు వారి వద్ద నుంచి రెండో స్లిప్ తీసుకుని ఓటు వేసిన ఘటనలు ఉన్నాయి. సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఏ పోలింగ్ బూత్ వద్ద ఎవరు దొంగ ఓట్లు వేశారో ఇట్టే అర్థమైపోతుంది.

క్లుప్తంగా

రోప్ స్కిప్పింగ్‌లో బంగారు పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈనెల 4, 5 తేదీల్లో నేపాల్‌లోని ఖాట్మండులో జరిగిన జాతీయ స్థాయి సౌత్ ఏషియన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్-2024లో జిల్లా క్రీడాకారులు పలు పతకాలు సాధించారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను స్థానిక బీఆర్ స్టేడియంలో సత్కరించారు. పోటీల్లో పాల్గొన్న డి.ప్రగ్న దియా జోస్లీన్‌కు రెండు బంగారు, పి.రాజ మీనాక్షికి బంగారు, రజతం, ఎ.మేరికి బంగారు, రజత పతకాలు లభించాయని పేర్కొన్నారు. వీరందరూ త్వరలో థాయ్‌లాండ్‌లో జరగనున్న ఏషియన్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్. వెంకటేశ్వర రెడ్డి, కొసనా వేణుగోపాల్, కోచ్ ఇమాన్యుయేల్ రాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీలో శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు ఉన్న అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజులపాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తోపాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకుపైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

సందేశాత్మకంగా నాటికలు

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, కొలకలూరు, వైకే నాటక కళాపరిషత్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో కొలకలూరులో రాష్ట్రస్థాయి దశమ ఆహ్వాన నాటికల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గ్రామంలోని చిన్న రథశాల వద్ద ప్రత్యేక వేదికపై జరుగుతున్న ఈ పోటీల్లో రెండోరోజు కార్యక్రమాలను శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన వల్లూరు వరప్రసాద్, ఎస్.రవీంద్రరెడ్డి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు దేవిరెడ్డి రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. నాటకరంగ ప్రముఖులు కాట్రగడ్డ రామకృష్ణ, సుద్దపల్లి శరత్‌వెంకయ్య, జీవీజీ శంకర్, డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, ఆకుల మల్లేశ్వరరావు మాట్లాడారు. కొలకలూరు గ్రామానికే చెందిన ప్రముఖ సినీనటుడు, నటశిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ స్వర్గీయ డీఎస్ దీక్షిత్ స్మారక పురస్కారాన్ని గుంటూరుకు చెందిన ప్రముఖ నటుడు, దర్శకుడు ఎస్.రవీంద్రారెడ్డికి ప్రదానం చేశారు. సభకు ముందు శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవాసంస్థ-బొరివంక (శ్రీకాకుళం జిల్లా) వారిచే 'కొత్త పరిమళం' నాటికను ప్రదర్శించారు. ద్వేషం అనేది మనిషికైనా, దేశానికైనా మంచి చేయదు.. చివరకు అనర్థమే మిగులుతుంది. జాతి, మత ద్వేషాల్ని అంతం చేసి మానవత్వపు విశ్వరూప సౌందర్యం అనే కొత్త పరిమళంతో హద్దులు, సరిహద్దులు లేని అందమైన ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే సందేశాన్నిచ్చిందీ నాటిక. కాండ్రేగుల శ్రీనివాసరావు మూలకథను కేకేఎల్ స్వామి నాటకీకరించగా, బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించారు.



కొత్త పరిమళం నాటికలోని సన్నివేశం



ఎస్.రవీంద్రారెడ్డికి డీఎస్ దీక్షిత్ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

సభానంతరం మిత్రా క్రియేషన్స్, నరసరావుపేట వారి 'నోట్ దిస్ పాయింట్' నాటికను ప్రదర్శించారు. రోడ్డుపై కనిపించే అనాథ బాలల సంక్షేమాన్ని కాంక్షించిందీ నాటిక. ప్రముఖ నాటక/సినీ రచయిత స్వర్గీయ గంథం నాగరాజు రచించిన ఈ నాటికకు ఎస్ఎం బాషా దర్శకత్వం వహించారు. చివరగా శ్రీకృష్ణా తెలుగు థియేటర్స్ ఆర్ట్, న్యూఢిల్లీ సమాజం 'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటికను ప్రదర్శించింది. భార్యాభర్తల అనుబంధంలోని సాంద్రతను, మాధుర్యాన్ని తెలియజెప్పిందీ నాటిక. శారదా ప్రసన్న రచనకు డీవీ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు వైఎస్‌కేఎస్ స్వామి, గోపరాజు విజయ్, ఇతర బాధ్యులు పర్యవేక్షించారు.

నిరాధార సమాచారం ప్రసారం చేసిన వారిపై చర్యలు

జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ రాఘవేంద్ర



నరసరావుపేట: పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగిన రోజున నుంచి జరిగిన సంఘటనలపై నిరాధార, అబద్ధపు సమాచారం ప్రసారం చేసిన వారిపై చట్టపరపమైన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అటువంటి వాటిని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఇతర గ్రూపుల్లో తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే గ్రూప్ అడ్మినే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా ఇంతకు ముందు ఎప్పుడో జరిగిన సంఘటనలను ప్రస్తుతం జరిగిన సంఘటనలుగా చిత్రీకరించి వాటిని సామాజిక మాధ్యమాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలలో పోస్ట్‌చేస్తే వారిపై క్రిమినల్‌చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వాట్సప్ గ్రూప్‌లో యాడ్‌చేసే ప్రతి సభ్యుడు తప్పకుండా అడ్మిన్‌కి తెలిసి ఉండాలని, ఎవరైనా సభ్యులు అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలని, ఫేక్ న్యూస్, వదంతులపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వివాదస్పద పోస్టింగ్ సంబంధించి అడ్మిన్ చర్యలు తీసుకోకుంటే వారిపై ఐపీసీ 153, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కుల, మత, వర్గ రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టేవి ఇతరులకు ఎట్టి పరిస్థితిలో షేర్ చేయకూడదని, కాదని ఎవరైనా షేర్ చేసిన ఎడల వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్టాంప్‌ల కొరతపై పిటిషన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలో స్టాంప్‌ల కొరతపై పిటిషన్ దాఖలైంది. ఈనెల 24న జిల్లా రిజిస్ట్రార్ హాజరై, సంజాయిషీ ఇవ్వాలని న్యాయ సేవాధికారి సంస్థ నుంచి నోటీసులు జారీ అయినట్లు బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సుమారు ఏడాది నుంచి జిల్లా కోర్టు ఆవరణలో రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 స్టాంప్‌ల కృత్రిమ కొరత నెలకొంది. ప్రతి రోజు పిటిషన్లపై, దరఖాస్తులపై ఆయా ధరలకు అనుగుణంగా స్టాంప్‌లు కొనుగోలు చేసి న్యాయవాదులు, కక్షిదారులు అతికించేవారు. రోజుకు సుమారు లక్ష రూపాయల స్టాంప్‌లను వినియోగిస్తారు. కొరత వల్ల స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీనివల్ల కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని బ్రహ్మారెడ్డి వివరించారు. పిటిషన్ నేపథ్యంలో ఈనెల 24న జిల్లా రిజిస్ట్రార్ హాజరై, సంజాయిషీ యివ్వాలని న్యాయాసేవాధికార సంస్థ నుంచి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

చేబ్రోలు మండలంలో భారీ వర్షం



వీరనాయకునిపాలెం గ్రామంలో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



నారాకోడూరు వద్ద మిరప రాసుల మీద పట్టాలు కప్పిన రైతులు

చేబ్రోలు: వాతావరణంలో రెండు రోజులుగా వచ్చిన మార్పుల ఫలితంగా చేబ్రోలు మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వివిధ గ్రామాల్లోని మామిడి, సపోట తోటలకు కొంతమేర నష్టం కలిగింది. మిరప కల్లాల్లోకి నీరు చేరింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. గ్రామాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పండ్లతోటలకు నష్టం కలిగింది. కాయలు రాలిపోయాయి. నారాకోడూరు, వీరనాయకునిపాలెం, శలపాడు గ్రామాల్లో కల్లాల్లో ఎండబెట్టిన మిరపకాయలను వర్షం నుంచి కాపాడటానికి రైతులు అవస్థలు పడ్డారు. టార్పాలిన్ పట్టాలు కప్పి రక్షణ కల్పించారు. వీరనాయకునిపాలెం గ్రామ శివారులో విద్యుత్ స్థంభం పక్కకు ఒరిగిపోయింది. స్థానికుల సహాయంతో విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు. సాయంత్రం నుంచి వాతవరణ పొడిగా ఉండటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

20న మాస్టర్‌మైండ్స్‌లో జాబ్‌మేళా



మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: దక్షిణ భారతదేశంలోని కామర్స్ విద్యారంగంలో అత్యంత గుర్తింపుతో 22 ఏళ్ల అనుభవం కలిగిన మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మోహన్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు, క్లాస్ ఇన్‌చార్జులు, హాస్టల్ స్టాఫ్, అకౌంటెంట్లతోపాటు కంప్యూటర్, డీటీపీ ఆపరేటర్లు, హార్డ్‌వేర్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్, డ్రైవర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలతో 21 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.35వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. దూర ప్రాంతాల వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 10 గంటలకు బ్రాడీపేట 3/11లోని మాస్టర్‌మైండ్స్ మెయిన్ క్యాంపస్‌కు రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజుఫోటోలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 89784 80430, 91000 24059 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మూడేళ్ల బుడతడికి అద్భుత పురస్కారం

బాలమేధావి ప్రదీప్ నారాయణ్‌కి రవీంద్రరత్న అవార్డు

తెనాలి: రూరల్ మండలం గుడివాడ గ్రామానికి చెందిన బాలమేధావి బండికళ్ల ప్రదీప్ నారాయణ్‌కి 'రవీంద్రరత్న పురస్కారం-2024' లభించింది. భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన బెంగళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ దీనిని ప్రదానం చేసింది. విద్య, కళలు, సంస్కృతి, సాంఘిక సంక్షేమం వంటి వివిధ రంగాల్లోని భారతీయ పౌరుల అంకితభావం కృషికి గుర్తింపుగా దీనిని ఏటా అందిస్తోంది. బండికళ్ల ప్రదీప్ నారాయణ్ ఏడాది 11 నెలల వయసు నుంచి ప్రదర్శిస్తున్న అద్భుత జ్ఞాపకశక్తి పటిమకు అనేక అవార్డులు వరించాయి. జంతువులు, పక్షులు, పండ్లు, కూరగాయలు, మానవ శరీర భాగాలు, గృహోపకరణాలతో సహా మొత్తం 150 పేర్లను గుర్తిస్తున్నాడు. 11 నిముషాల్లోనే వాటి పేర్లను చెబుతున్నాడు. ఈ అసాధారణ సామర్థ్యంతో ప్రస్తుతం మూడేళ్ల వయసు కలిగిన ప్రదీప్ నారాయణ్ 8 ప్రపంచ రికార్డులను, మూడు జాతీయ రికార్డులను అందుకోవటం విశేషం. తాజాగా రవీంద్ర రత్న పురస్కారం బుడతడిని వరించింది. ఇతడి తల్లిదండ్రులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావటం విశేషం. పసివయసులో బిడ్డలోని జ్ఞాపకశక్తిని గుర్తించి, తగిన విధంగా నేర్పించినట్టు తండ్రి రాజేష్ వెల్లడించారు.

విజ్ఞాన్ వర్సిటీలో హైటెక్ నర్సరీ ప్రారంభం

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''హైటెక్ నర్సరీ'' ని అగ్రికల్చరల్ అండ్ హార్టి కల్చరల్ సైన్సెస్ ఫాంను శుక్రవారం ఇండియా, యూఎస్ఏ ఐడీ మిషన్ డైరెక్టర్ వీణారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ మార్పులను తగ్గించడానికి, వ్యవసాయ అటవీ పెంపకానికి సహకరించాలని విద్యార్థులను కోరారు. ఏటా ఒక మిలియన్ ఆరోగ్యకరమైన మొక్కలను ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో, దేశీయ చెట్ల జాతులను పెద్ద ఎత్తున ప్రచారం చేయడానికి హైటెక్ నర్సరీని చేపట్టామన్నారు. వాతావరణ-స్మార్ట్ వ్యవసాయ పద్ధతులలో పెట్టుబడి పెట్టడం ద్వారా వాతావరణ మార్పులను తగ్గించవచ్చన్నారు. తెలుగు రాష్ట్రాల్లో యూఎస్ఏ ఐడీ మిషన్ ప్రోగ్రాం ద్వారా అవగాహన ఒప్పందం కుదుర్చుకుని హైటెక్ నర్సరీను మొట్టమొదటిగా ప్రారంభిస్తున్న ఘనత విజ్ఞాన్స్ యూనివర్సిటీదేనన్నారు. టీవోఎఫ్ఐ మనోజ్ దబాస్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, అగ్రికల్చరల్ విద్యార్థులు పాల్గొన్నారు.



హైటెక్ నర్సరీ ప్రారంభోత్సవంలో వీణారెడ్డి, చైర్మన్ లావు రత్తయ్య

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో వచ్చే విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు జూన్ 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లాస్థాయి శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బీఎస్ఎస్ ఎస్వీ ప్రసాదరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, తల్లిదండ్రులతోపాటు విద్యార్థి ఆధార్ జిరాక్స్ కాపీలు, విద్యార్థి ఫొటో, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, అడ్రస్సు తదితర వివరాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా నెట్ కేంద్రాలతోపాటు సమీపంలోని ఐటీఐ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐలో సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 17,776 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలకు ఫెయిలైన విద్యార్థులతోపాటు బెటర్‌మెంట్ రాస్తున్న విద్యార్థులను కలుపుకుని 15,291 మంది హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్న ద్వితీయ సంవత్సర పరీక్షలకు 2,485 మంది హాజరు కానున్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐఓ జీకే జుబేర్ పేర్కొన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను ఈనెల 20 తరువాత ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో ఉంచుతారని తెలిపారు.

26 నుంచి మహంకాళి ఆలయ వార్షికోత్సవాలు

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళి ఆలయ ప్రతిష్ఠా వార్షికోత్సవాలను ఈనెల 26 నుంచి 30 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.సి.హెచ్.వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహంకాళి దేవస్థానంలో అమ్మవారికి 26న ఆదివారం ఉదయం లక్ష్మీదేవి అలంకరణ, 27న సోమవారం సరస్వతీదేవి అలంకరణ, 28న మంగళవారం రాజరాజేశ్వరిదేవి అలంకరణ, 29న బుధవారం ధనలక్ష్మీ దేవి అలంకరణ, 30న గురువారం గాయత్రీ దేవి అలంకరణలు చేస్తామని, 30న సాయంత్రం విశేష అలంకారాలతో గ్రామోత్సవం నిర్వహించనున్నామని వెల్లడించారు.

నిత్యాన్నదానానికి పలువురు భక్తుల విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు శుక్రవారం విరాళాలను అందజేశారు. విజయవాడ కోటంరాజు వీధికి చెందిన వై. బాలకృష్ణ కుటుంబం ఆలయ అధికారులను కలిసి రూ.1,00,116, గుంటూరుకు చెందిన ఒంటెద్దు ఓబుళరెడ్డి కుటుంబం రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. దాతలకు ఆలయ ఏఈవో వెంకటరెడ్డి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ చేపట్టిన డీఎస్పీ

బాధిత కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా

రాజుపాలెం: ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన మండలంలోని గణపవరం గ్రామంలో ఎస్టీ వర్గానికి చెందిన వారిపై అగ్రవర్ణాల వారు దాడి చేసి గాయపర్చిన ఘటనపై పోలీసు శాఖ అధికారులు శుక్రవారం విచారణ చేశారు. గ్రామంలోని ఎస్టీ వర్గానికి చెందిన మాజీ సర్పంచ్ కొజ్జా శివశంకర్ భార్య జ్యోతిపై, కుమార్తె పూజితలపై ఓసీ వర్గానికి చెందిన వారు విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. బాధితురాలు జ్యోతి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు గణపవరంలోని ఎస్టీ కాలనీలోని బాధితులను విచారించారు. బాధితులు జ్యోతి, పూజితలు కలసి మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు వెళుతున్నారు. మార్గంమధ్యలో ఓసీ వర్గానికి చెందిన గొడుగునూరి రాంబాబు, గొడుగునూరి శ్రీధర్, నరిశెట్టి చందు, వీరితోపాటు మరో ఏడుగురు కలసి నాపైన, నా కూతురుపైన కర్రలతో దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టి గాయపరిచారని డీఎస్పీకి వివరించారు. అనంతరం నేను స్పృహ కోల్పోవడంతో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని, వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని డీఎస్పీకి తెలిపారు. అంతే కాకుండా 12వ తేదీ రాత్రి మా కాలనీ సమీపంలో నేను వస్తుండగా అప్పటికే కాలనీ వద్ద వేచి ఉన్న గొడుగునూరి రాంబాబు, గొడుగునూరి శ్రీధర్, నరిశెట్టి చందులు నన్ను కులంపేరుతో తిట్టి నాపైట కొంగు పట్టుకుని లాగి అసభ్యంగా ప్రవర్తించారని చెప్పింది. డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ మీ కుటుంబానికి అండగా ఉంటుందని, మీరు ఎవ్వరికి భయపడవద్దని, మీకు అన్ని విధాలా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎస్ఐ అమీర్ బాషా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రక్కు


ఒకరు మృతి, ఇద్దరికి స్వల్ప గాయాలు



అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రక్కు, ఘటనా స్థలంలో మృతి చెందిన కలకోటి ప్రవీణ్

జి.కొండూరు: పశువులను తరలిస్తున్న వ్యాను అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్తే...గుంటూరు జిల్లా, మంగళగిరికి చెందిన కలకోటి ప్రవీణ్(35), కనపాల ప్రసాదరావు, ధూరు ఇర్మియా పశువుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. తిరువూరు పశువుల సంత నుంచి శుక్రవారం ఉదయం ఆరు దున్నపోతులను కొనుగోలు చేసిన వీరు ముగ్గురు, తమతోపాటు తీసుకొచ్చిన ట్రక్కులో వాటిని మంగళగిరికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న ట్రక్కు జి.కొండూరు శివారులోని బైపాస్‌రోడ్డుపై హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రక్కుపై కూర్చున్న కలకోటి ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రక్కు ముందు భాగంలో కూర్చున్న కనపాల ప్రసాదరావు, ధూరు ఇర్మియాకు స్వల్ప గాయాలయ్యాయి. వాహనం నడుపుతున్న డ్రైవర్ ధూరు మరియదాసుకు ఎటువంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్, సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహనంలో పరిమితికి మించి పశువులను ఎక్కించడంతో అవి ఒకదానిపై ఒకటి పొట్లాడుకోవడం వలన వాహనం అదుపు తప్పి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు స్వీకరించిన డ్రైవర్లతో డిపో మేనేజర్ వీరాస్వామి

నరసరావుపేట: స్థానిక డిపో ఆవరణలోని హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తిచేసుకున్న 15వ బ్యాచ్‌కు చెందిన వారికి శుక్రవారం డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 15 బ్యాచ్‌లకు చెందిన 215మందికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయటం జరిగిందన్నారు. 16వ బ్యాచ్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, 16సీట్లు మాత్రమే ఉండటంతో శిక్షణ పొందగోరే లైట్ మోటార్ వెహికిల్ డ్రైవర్లు 73828 96038, 99592 25428లను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శిక్షకులు సీహెచ్.మోహనరెడ్డి పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయ భూముల కౌలు వేలం

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన భూములకు శుక్రవారం ఆయా గ్రామాల్లో బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు గ్రూపు దేవస్థానాల ఈవో కోటిరెడ్డి శుక్రవారం తెలిపారు. దేవస్థానానికి భూములున్న శింగరకొండపాలెం, వెంకటాపురం గ్రామాల్లో వేలం నిర్వహించినట్లు చెప్పారు. వెంకటాపురం గ్రామంలో ఉన్న 12.96 ఎకరాలకు గతంలో రూ.1.54 లక్షలు పలుకగా ఈ ఏడాది వేలంలో రూ.2.85 లక్షలు పలికిందని పేర్కొన్నారు. సీతారామస్వామి దేవస్థానానికి ఉన్న 19 ఎకరాలకు ఈ సంవత్సరం రూ.1.66 లక్షలు పలికిందని తెలిపారు. శింగరకొండపాలెంలోని 24.50 ఎకరాలకు ఈ ఏడాది రూ.5.49 లక్షలు పలికినట్లు ఈవో వెల్లడించారు.